ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 262 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 23 ఏప్రిల్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

పహల్గాం ఉగ్రదాడి ఘటన..

పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మోదీ తిరుగు ప్రయాణం

పహల్గాం దాడి ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ విమానం పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మరో మార్గంలో ప్రయాణించినట్లు తెలుస్తోంది.

దిల్లీ, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూకశ్మీర్లోని అనంత్నాగ్ జిల్లాలో పర్యటకులపై భీకర ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సౌదీ అరేబియా పర్యటనను కుదించుకొని హుటాహుటిన భారత్ చేరుకున్న సంగతి తెలిసిందే. అయితే, తిరుగు పయనంలో ఆయన విమానం పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మరో మార్గంలో ప్రయాణించారు. ఈ మేరకు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్సైట్లో ఉన్న దృశ్యాలను బట్టి తెలిసింది. మంగళవారం ఉదయం ప్రధాని మోదీ ప్రయాణించిన ఎయిర్ఫోర్స్ బోయింగ్ 777-300 విమానం పాకిస్థాన్ గగనతలం మీదుగా రియాద్ చేరుకుంది.

అయితే, దాడి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా తిరుగు ప్రయాణానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉపయోగించారు. ప్రధాని విమానం అరేబియా సముద్రం మీదుగా గుజరాత్ గగనతలంలోకి ప్రవేశించి అక్కడినుంచి దిల్లీకి చేరుకుంది. పాకిస్థాన్ నుంచి ముప్పు ఉండొచ్చన్న నిఘా వర్గాల సమాచారం నేపథ్యంలో రూట్ మార్చినట్లు తెలుస్తోంది. ఈ ఉదయం ఢిల్లీకి చేరుకున్న ప్రధాని మోదీ ఎయిర్పోర్టులోనే అత్యవసర సమావేశం నిర్వహించారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్తో భేటీ అయి దాడి గురించి చర్చించారు. భద్రతా చర్యలపై ఆరాతీశారు. మరోవైపు, ప్రధాని అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ కూడా నేడు భేటీ కానుంది. కశ్మీర్ లో మినీ స్విట్జర్లాండ్గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపుచర్యలు చేపట్టాయి.

ఉగ్రవాదం, హింసతో లక్ష్యాలేమీ సాధించలేరు:సీఎం చంద్రబాబు

ఉగ్రవాద చర్యలు సమాజంపై మాయని మచ్చ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

అమరావతి, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): ఉగ్రవాద చర్యలు సమాజంపై మాయని మచ్చ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఉగ్రవాదం, హింస ద్వారా లక్ష్యాలేమీ సాధించలేరని చరిత్ర చెప్తోందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సీఎం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ఈ దారుణమైన చర్యకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి ఏపీ ప్రభుత్వం మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన తెలుగువారు చంద్రమౌళి, మధుసూదన్కు సీఎం సంతాపం ప్రకటించారు. వారి కుటుంబాలకు జరిగిన నష్టాన్ని భరించే శక్తి పొందాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంటూ చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీనగర్ హోటల్లో చిక్కుకుపోయిన 80 మంది తెలంగాణ పర్యటకులు

తెలంగాణ జిల్లాల నుంచి శ్రీనగర్కు పలువురు పర్యటకులు వెళ్లారు.

హైదరాబాద్, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ జిల్లాల నుంచి శ్రీనగర్కు పలువురు పర్యటకులు వెళ్లారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో వీరు భయాందోళనకు గురవుతున్నారు. శ్రీనగర్ లోని ఓ హోటల్లో దాదాపు 80 మంది తెలంగాణ పర్యటకులు చిక్కుకుపోయారు. దీనిపై పర్యటకులు ఓ వీడియో విడుదల చేశారు. తామంతా హోటల్లో చిక్కుకుపోయామని.. తమను హైదరాబాద్కు సురక్షితంగా చేర్చాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. హోటల్లో చిక్కుకున్న వారిలో హైదరాబాద్ నుంచి 20 మంది, వరంగల్ నుంచి 10 మంది, మహబూబ్నగర్ నుంచి 15 మంది, సంగారెడ్డి నుంచి 10 మంది ఉన్నట్లు సమాచారం. మెదక్ పట్టణానికి చెందిన రెండు కుటుంబాలు కూడా ఉన్నాయి. వీరంతా మంగళవారం జమ్మూకశ్మీర్ సందర్శనకు వెళ్లి శ్రీనగర్ హోటల్లో చిక్కుకుపోయారు.

హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డి పిటిషన్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్లో కోరారు.

హైదరాబాద్, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్లో కోరారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై భాజపా నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు.



భాజపాకు పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్ ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. భాజపా మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పారని కాసం తన పిటిషన్లో పేర్కొన్నారు. ఈ పిటిషన్పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం ఆడియో, వీడియో క్లిప్పింగ్లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్పై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

తెదేపా నేత వీరయ్య చౌదరి భౌతిక కాయానికి సీఎం చంద్రబాబు నివాళులు

నిన్న హత్యకు గురైన తెదేపా నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి భౌతిక కాయానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు.

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): నిన్న హత్యకు గురైన తెదేపా నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి.. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒంగోలులో తెదేపా నేత వీరయ్య చౌదరి మంగళవారం హత్యకు గురైన విషయం తెలిసిందే. దీంతో నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలుకు చేరుకున్న సీఎం చంద్రబాబు.. వీరయ్య చౌదరి అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. సీఎం వెంట మంత్రులు అనిత, ఆనం, డోలా, ఎంపీ మాగుంట, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు.

మనమంతా ఒక్కటే.. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో కేంద్రానికి సహకరిస్తాం:ఖర్గే

ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో కేంద్రప్రభుత్వానికి సహకరిస్తామని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

దిల్లీ, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూకశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడి ఘటనపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి స్పందించారు. ఈ ఉగ్రదాడి మన దేశ ఐక్యత, సమగ్రతపై ప్రత్యక్ష దాడిగా పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు కేంద్రంతో సహకరించేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. రాజకీయాలకు ఇది సమయం కాదు. పహల్గాం ఉగ్రదాడిలో నేరస్థులను న్యాయస్థానంలో నిలబెట్టాలి. బాధితులకు న్యాయం జరగాలి.

మన దేశ ఐక్యత, సమగ్రతపై ప్రత్యక్ష దాడి జరిగింది. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తాం. పహల్గాంలో జరిగిన ఘటన గురించి జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాతో మాట్లాడాను. ఈ విషయంపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గురువారం సమావేశం కానుంది" అని 'ఎక్స్' వేదికగా ఖర్గే వెల్లడించారు. "భారత్ పై ప్రత్యక్ష దాడి జరిగింది. యావత్ దేశమంతా షాకికి గురైంది. ఈ దాడికి పాకిస్థాన్కు చెందిన ఒక ఉగ్రసంస్థ బాధ్యత వహిస్తోంది. అయితే.. మనకు జరిగిన అన్యాయానికి తగిన బదులు ఇవ్వాలి. మనమంతా ఒక్కటే కలిసి కట్టుగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదాం. ఉగ్రవాదులను ఏరి పారేసేందుకు కేంద్రం మరింత తీవ్రంగా కృషి చేయాలి. జమ్మూకశ్మీర్ భద్రతపై పర్యటకులకు నమ్మకం కలిగించాలి. మరికొన్ని రోజుల్లో అమర్నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఆ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎలాంటి ఉగ్రదాడులకు అవకాశం ఇవ్వకుండా భద్రతా బలగాలను మరింత పటిష్ఠం చేయాలి" అని సూచించారు. కాగా.. కాశ్మీర్ లో మినీ స్విట్జర్లాండ్గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యటకులను కాల్చి చంపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చేపట్టాయి.

శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులు

:కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఉగ్రదాడి నేపథ్యంలో శ్రీనగర్ నుంచి ముంబయి, దిల్లీకి ప్రత్యేక విమాన సర్వీసులు ఏర్పాటుచేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూకశ్మీర్లోని అనంత్నాగ్ జిల్లాలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడిలో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ప్రధాని నరేంద్ర మోదీ కేంద్రమంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్నాయుడు కీలక ప్రకటన చేశారు. పర్యటకుల భద్రత మేరకు వారి కోసం శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు ప్రత్యేక విమానాలు శ్రీనగర్ నుంచి ముంబయి, ఢిల్లీకి చేరుకుంటాయని.. ఈవిషయంపై మంగళవారం హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడానని తెలిపారు. అవసరమైతే మరిన్ని విమానాలు నడపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులోభాగంగా మంత్రి అన్ని విమానయాన ఆపరేటర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కష్ట సమయంలో ప్రయాణికులపై భారం పడకుండా.. సాధారణ స్థాయి ఛార్జీలను వసూలుచేయాలని విమానయాన సంస్థలను ఆదేశించారు. మరణించిన వ్యక్తులు మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకొని పనిచేస్తూ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. జమ్మూలో ప్రస్తుత పరిస్థితుల గురించి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్నాథ్ శిందే, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడుతో రామ్మోహన్నాయుడు మాట్లాడారు. కాశ్మీర్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు సురక్షితంగా తిరిగి రావడంలో సాయం చేయడానికి ఢిల్లీలోని ఆంధ్రభవన్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశామన్నారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖపట్నం వాసి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళి కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. మృతదేహాన్ని విమానంలో తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల గుండె ధైర్యం భారాస

:రజతోత్సవ సభాస్థలి పరిశీలనలో కేటీఆర్

భారాస రజతోత్సవ సభ ప్రజల్ని రెచ్చగొట్టడానికో, ప్రభుత్వ వ్యతిరేకతను పెంచడానికి కాదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): భారాస రజతోత్సవ సభ ప్రజల్ని రెచ్చగొట్టడానికో, ప్రభుత్వ వ్యతిరేకతను పెంచడానికి కాదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 25 వసంతాలు పూర్తి చేసుకున్నందున జరుపుకొనే వేడుక మాత్రమేనని తెలిపారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో పర్యటించిన ఆయన.. భారాస రజతోత్సవ సభాస్థలి వద్ద ఏర్పాట్లు పరిశీలించారు.

జమ్మూకశ్మీర్లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఉద్యమ పార్టీగా ప్రతిపక్షంగా, ప్రభుత్వంలో ఎక్కడ ఉన్నా తెలంగాణ కీర్తిని హిమాలయాల స్థాయికి తీసుకెళ్లిన ఘనత కేసీఆర్దేనన్నారు. "14 ఏళ్ల పాటు నిర్విరామంగా పోరాటం చేసి అన్ని వర్గాలను సమీకరించి రాష్ట్ర సాధన ఉద్యమం చేసిన పార్టీ భారాస. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం బీఆర్ఎస్. గులాబీ జెండా అన్ని వర్గాలకు అండగా ఉంటుందనే పద్ధతిలో ప్రజలు గులాబీ జెండా వైపు చూస్తున్నారు. ఏ సమస్య వచ్చినా తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారు. 1250 ఎకరాల్లో సభా స్థలం ఉండగా.. వెయ్యి ఎకరాలు పార్కింగ్ కోసం కేటాయించాం. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేస్తున్నాం. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య తాగునీటి వసతి కల్పిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటుపై నమ్మకం లేనందున జెనరేటర్లు ఏర్పాటు చేశాం. భారాస చరిత్రలో ఇది భారీ బహిరంగ సభ కాబోతుంది" అన్నారు.

ముగ్గురు ఉగ్రవాదుల ఊహాచిత్రాలు విడుదల..!

పహల్గాం ఉగ్ర దాడికి పాల్పడిన వారి ఊహా చిత్రాలను ఏజెన్సీలు విడుదల చేశాయి.

పహల్గాం, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్):జమ్మూకశ్మీర్లోని పహల్గాం ఉగ్ర దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. మూసా, యూనిస్, ఆసీఫ్ అనే కోడ్నేమ్లు కూడా ఉన్నట్లు పీటీఐ పేర్కొంది. వీరందరూ జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేసే 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్లో సభ్యులు. ఉగ్రదాడి నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం ఈ చిత్రాలను తయారు చేశారు. టెర్రరిస్టులు పురుషులను వేరు చేసి వారి గుర్తింపులను పరిశీలిస్తున్న సమయంలో బాధితులు వారి ముఖాలను చూశారు. దీంతో జమ్మూకశ్మీర్లో ఉగ్ర వేట తీవ్రమైంది. దీంతోపాటు ఓ ఉగ్రవాది ఆటోమేటిక్ ఆయుధంతో ఉన్న ఫొటోను కూడా విడుదల చేశారు.



బైసరన్ లోయనే ఎందుకు ఎంచుకొన్నారు..?

ఉగ్రవాదులు పర్యటకులపై దాడికి బైసరన్ లోయనే వ్యూహాత్మకంగా ఎన్నుకొన్నట్లు తెలుస్తోంది. వీలైనంత ఎక్కువ మంది ప్రాణాలు తీసేందుకు వీలుగా దీనిని లక్ష్యంగా చేసుకొన్నారు. ఈ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు అంతగా ఉండవన్న విషయాన్ని వారు వాడుకొన్నారు. దీనికితోడు పహల్గాం నుంచి ఇక్కడికి రావాలంటే 6.5 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అది కూడా కాలినడకన లేదా గుర్రాలపైనే సాధ్యమవుతుంది. దీంతో కచ్చితంగా భద్రతా బలగాల రాక, సహాయక చర్యలు ఆలస్యమవుతాయి. ఈ లోయ చుట్టూ చిక్కటి అటవీ ప్రాంతం ఉండటం.. మంచు కరిగిపోవడంతో ఉగ్రవాదులు పారిపోవడం కూడా తేలిక. ఇక ఇక్కడ సైన్యం ఆపరేషన్ చేపట్టినా.. వెంటనే ముష్కరులను గుర్తించలేని పరిస్థితి ఉంటుంది.

బాడీ కెమెరాలతో చిత్రీకరించి..

మంగళవారం సాయంత్రం 3 గంటల సమయంలో పహల్గాం దాడి మొదలైంది. ముష్కరులు బాడీ కెమెరాలతో దాడిని చిత్రీకరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వీటిని హెల్మెట్లకు ధరించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. తొలుత బాధితులు అందరినీ ఉగ్రవాదులు ఒకచోటుకు చేర్చి వారి గుర్తింపులను తనిఖీ చేశారు. అనంతరం హత్య చేశారు. కొందరిని స్నైపర్ వంటి టెక్నిక్స్ వాడి దూరం నుంచే కాల్చారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1995:** ప్రపంచ పుస్తక దినోత్సవం
- **1616:** నాటక రచయిత విలియం షేక్స్పియర్ మరణం (జ. 1564).
- **1850:** ఆంగ్ల కవి విలియం వర్డ్స్ వర్త్ మరణం (జ. 1770).
- **1858:** జర్మన్ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత మాక్స్ ప్లాంక్ జననం (మ. 1947).
- **1858:** భారతీయ సంఘ సంస్కర్త పండిత రమాబాయి జననం (మ. 1922).
- **1891:** రచయిత, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి జననం (మ.1961).
- **1938:** భారతీయ సినిమా నేపథ్యగాయని ఎస్.జానకి జననం. (చిత్రంలో)
- **1992:** భారత సినీ దర్శకుడు సత్యజిత్ రే మరణం (జ. 1921).
- **2007:** రష్యా రాజకీయ వేత్త బోరిస్ యెల్సిన్ మరణం (జ.1931) .



ప్రపంచ పుస్తక దినోత్సవం


విలియం షేక్స్పియర్


విలియం వర్డ్స్ వర్త్


మాక్స్ ప్లాంక్

పండిత రమాబాయి

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ఎస్.జానకి

సత్యజిత్ రే

బోరిస్ యెల్సిన్

హహల్గాంలోనే నా పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నా: విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ పహల్గాంతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తన పుట్టిన రోజును అక్కడే చేసుకున్నట్లు తెలిపారు.



జమ్మూకశ్మీర్లోని అనంత్నాగ్ జిల్లాలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడిలో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పహల్గాంలో మంగళవారం ప్రకృతి అందాలను చూస్తోన్న పర్యటకులపై ఉగ్రవాదులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిని సినీ సెలబ్రిటీలు ఖండిస్తున్నారు. మినీ స్విట్జర్లాండ్గా పేరొందిన ఆ ప్రాంతంతో తన అనుబంధాన్ని హీరో విజయ్ దేవరకొండ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఈ దాడి ఘటన తన మనసును కలిచివేస్తోందంటూ పోస్ట్ పెట్టారు. "రెండేళ్ల క్రితమే నా పుట్టినరోజును పహల్గాంలో సెలబ్రేట్ చేసుకున్నాను. ఓ సినిమా షూటింగ్లో భాగంగా అక్కడికి వెళ్లిన నేను.. కాశ్మీర్లోని అందమైన ప్రాంతంలో అక్కడి ప్రజల స్వచ్ఛమైన నవ్వుల మధ్య నా పుట్టినరోజు చేసుకున్నాను. స్థానికంగా ఉండే కశ్మీరీ స్నేహితులు నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. నిన్న ఆ ప్రాంతంలో జరిగినది విని నా హృదయం పగిలిపోయింది. ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం సిగ్గుచేటు. ఇలాంటి పిరికి వాళ్లను త్వరలోనే అంతమొందిస్తారని ఆశిస్తున్నా. భారతదేశం ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు. బాధిత కుటుంబాలకు మేం అండగా నిలుస్తాం" అని విజయ్ దేవరకొండ తన పోస్ట్లో రాసుకొచ్చారు. పహల్గాంలో మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ సినీ ప్రముఖులు పోస్టు పెడుతున్నారు. ఇది క్షమించరాని క్రూరమైన చర్య అని చిరంజీవి అన్నారు. బాధితులను చూస్తుంటే తన హృదయం బరువెక్కుతోందని ఎన్టీఆర్ తెలిపారు. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేకపోతున్నానంటూ జాన్వీకపూర్ ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి తెలియజేస్తూ అల్లు అర్జున్ పోస్ట్ పెట్టారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఉగ్రదాడి... త్రుటిలో తప్పించుకున్న సెలబ్రిటీ జంట

జమ్మూకశ్మీర్ లో ఉగ్రదాడి జరగడానికి కొన్ని గంటల ముందే ఆ ప్రాంతాన్ని వీడినట్లు నటి దీపికా కాకర్ జంట తెలిపింది.

మంగళవారం మధ్యాహ్నం జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడి నుంచి మరికొందరు వారి ప్రాణాలను అరచేతపట్టుకొని బయటపడ్డారు. నటి దీపికా కాకర్ తన భర్త షోయబ్ ఇటీవల కశ్మీర్ వెళ్లారు. విహారయాత్రకు సంబంధించిన ఫొటోలను ఆదివారం ఇన్స్టాలో పంచుకున్నారు. కాశ్మీర్లోని అందమైన ప్రదేశాలను వీడియోలు తీసి షేర్ చేశారు. దాడి జరిగిన తర్వాత వీరి అభిమానులు ఆందోళన చెందారు. ఈ ఘటనలో వారు చిక్కుక్కున్నారేమోనని మెసేజ్లు పెట్టారు. తాజాగా దీపికా, ఆమె భర్త షోయబ్ దిల్లీ చేరుకున్నట్లు తెలుపుతూ ఓ పోస్ట్ పంచుకున్నారు. "మేం క్షేమంగా ఉన్నాం. మంగళవారం ఉదయమే కశ్మీర్ నుంచి బయలుదేరాం. సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నాం. ఎవరూ ఆందోళన పడకండి" అని ఇన్స్టాలో తెలిపారు.

షోయబ్ పోస్టు విమర్శలు

తాము క్షేమంగా ఉన్నామని తెలుపుతూ దీపికా భర్త నటుడు షోయబ్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు విమర్శలకు దారితీసింది. వారు ఢిల్లీ చేరుకున్నట్లు తెలిపిన నటుడు.. ఈ పర్యటనపై వ్లాగ్ చేసినట్లు వెల్లడించారు. అది త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. ఒకవైపు ఈ పెనువిషాదంపై దేశమంతా బాధపడుతుంటే ఇప్పుడు వ్లాగ్ ప్రచారం చేసుకుంటున్నారా..? అంటూ కొందరు నెటిజన్లు విమర్శిస్తూ కామెంట్స్ పెడుతున్నారు. జమ్మూకశ్మీర్ లోని పహల్గాంలో మంగళవారం ఉగ్రవాదులు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్లో లోని కొండల మధ్య పర్యటకులపై పాశవికంగా దాడి చేసి 28 మందిని పొట్టన పెట్టకున్నారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్

రూ.27 కోట్ల ఆటగాడు రెండు బంతుల కోసమా?

ఏడో స్థానంలో రావడమెందుకు?

రిషబ్ పంత్కు ఈ సీజన్ కలిసి రాలేదు. లబ్బూపూ సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ అదనపు ఒత్తిడి తెచ్చిందేమో బ్యాటింగ్లో పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు.

ఐపీఎల్ చరిత్రలో అత్యంత విలువైన ఆటగాడు రిషభ్ పంత్. మెగా వేలంలో పంత్ను రూ.27 కోట్లు వెచ్చించి లఖ్నవూ సూపర్ జెయింట్స్ దక్కించుకుంది. ఇప్పటివరకు 9 మ్యాచుల్లో 8 ఇన్నింగ్స్ ల్లో కేవలం 106 పరుగులు చేశాడు. అంటే ఒక్కో కోటికి నాలుగు పరుగులు కూడా చేయలేదని ఫ్యాన్స్ వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్లో ఏడో స్థానంలోకి బ్యాటింగ్కు రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సెకండాన్లో వచ్చే పంత్ ఢిల్లీతో పోరులో ఏడో స్థానంలో వచ్చాడు. అదీనూ అప్పటికి ఇంకా రెండు బంతులు మాత్రమే ఉన్నాయి. డకౌట్గా పెవిలియన్కు చేరి నిరాశపరిచాడు. ఈ విషయంలోనే మేనేజ్మెంట్ తీరుపై పంత్ అసహనం వ్యక్తం చేసినట్లు కథనాలు వస్తున్నాయి. "ఎప్పుడూ నవ్వుతూ.. నిర్భయంగా ఆడే రిషభ్ పంత్ వంటి క్రికెటర్ ఇప్పుడు విఫలం కావడం బాధిస్తోంది. ఇదంతా గోయెంకాకు భయపడటం వల్లేనని అనిపిస్తోంది. పంత్ తన సహజసిద్ధమైన ఆటతీరును కోల్పోయినట్లున్నాడు. దీని వెనక ఇంకేమైనా ఉందా?" అని ఓ నెటిజన్ వీడియోను పోస్టు చేశాడు. ఓపెనర్లుగా మిచెల్ మార్ష్, ఐడెన్ మారమ్ వచ్చారు. మారమ్ ఔటైన తర్వాత నికోలస్ పూరన్ వచ్చాడు. త్వరగా పెవిలియన్కు చేరాడు. అప్పుడు పంత్ రావాల్సిఉంది. కానీ, అబ్దుల్ సమద్ (2) విఫలమయ్యాడు. అప్పటికైనా పంత్ను కాదని డేవిడ్ మిల్లర్ (14బి), ఆయుష్ బదోని (36) ముందొచ్చారు. మిల్లర్ ఔటైన తర్వాత అప్పటికి రెండు బంతులు మాత్రమే మిగిలిఉన్నాయి. కానీ, డకౌట్గా పెవిలియన్ చేరడం గమనార్హం. మ్యాచ్కు కామెంటేటర్గా వ్యవహరించిన షేన్ వాట్సన్ మాట్లాడుతూ.. "ఈ నిర్ణయం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. నాలుగో స్థానంలో ఎందుకు రాలేదో అర్థం కాలేదు" అని వ్యాఖ్యానించాడు.

అందుకే ఇలాంటి నిర్ణయం: పంత్

"మేం మ్యాచ్లో 20 పరుగులు తక్కువగా చేశామని అనిపించింది. లఖ్నవూలో టాస్ కీలక పాత్ర పోషిస్తుంది. తొలుత బౌలింగ్ చేసినవారికి పిచ్ నుంచి సహకారం దక్కుతుంది. మేం ఆయుష్ బదోనిని ఇంపాక్ట్ తీసుకోవడానికి కారణం ఉంది. గాయం నుంచి కోలుకొని వచ్చాడు. కాస్త సమయం ఇవ్వాలనే ఉద్దేశంతో బరిలోకి దింపలేదు. ఇక తాను బ్యాటింగ్ ఆర్డర్ కిందికి రావడానికి కారణముంది. సమద్ను ముందు పంపించి మరిన్ని పరుగులు వచ్చేలా చేద్దామనుకున్నాం. మిల్లర్ దూకుడుగా ఆడే ప్లేయర్. కానీ, వీరిద్దరూ పరుగులు రాబట్టలేదు. అనుకొన్న ప్రణాళికలు ఒక్కోసారి ఫలించవు. ముమ్ముందు మ్యాచుల్లో మెరుగైన ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాం" అని పంత్ తెలిపాడు.

ఫిట్నెస్

ఎవరికీ తెలియని వాకింగ్ ట్రిక్స్

చిన్న మార్పులతో ఇన్ని లాభాలా

జిమ్ కి వెళ్లి రకరకాల వర్కౌట్స్ చేసే బదులు వాకింగ్ చేసినా సరిపోతుంది. కానీ ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరగాలి. కొంత మంది చాలా వేగంగా నడుస్తారు. మరి కొంత మంది చాలా నెమ్మదిగా నడుస్తుంటారు. ఒళ్లంతా చెమటలు పట్టేలా కొంత మంది నడిస్తే అసలు ఏ మాత్రం అలిసిపోయినట్టే కనిపించకుండా ఇంకొందరు నడు-స్తుంటారు. నిజానికి వాకింగ్ విషయంలో చాలా మందికి తెలియని కొన్ని ట్రిక్స్ ఉన్నాయి.

వాకింగ్ చేయడం అంటే అదేదో మొక్కుబడిగా నడవడం కాదు. శరీరంలోని ప్రతి కండరంలోనూ కదలిక కనిపించాలి. నడిచేది పావుగంట అయినా సరే దాని వల్ల ప్రయోజనం ఉండాలి. వాకింగ్ అంటే ఏదో నాలుగు అడుగులు వేయడం అనుకుంటారు. కానీ కొన్ని ట్రిక్స్ ఫాలో అయితే రెట్టింపు ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. సరైన విధంగా నడిస్తే గుండె సంబంధిత సమస్యలేమీ రావు. క్యాన్సర్ లాంటి జబ్బులు కూడా దరి చేరవు. అంతే కాదు. వాకింగ్ వల్ల మానసిక ఆరోగ్యమూ బాగుంటుంది. రోజంతా చురుగ్గా ఉండొచ్చు. బాడీ ఫిట్ గా మారుతుంది. జిమ్ కి వెళ్లి రకరకాల వర్కౌట్స్ చేసే బదులు వాకింగ్ చేసినా సరిపోతుంది. కానీ ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరగాలి. కొంత మంది చాలా వేగంగా నడుస్తారు. మరి కొంత మంది చాలా నెమ్మదిగా నడుస్తుంటారు. ఒళ్లంతా చెమటలు పట్టేలా కొంత మంది నడిస్తే అసలు ఏ మాత్రం అలిసిపోయినట్టే కనిపించకుండా ఇంకొందరు నడుస్తుంటారు. నిజానికి వాకింగ్ విషయంలో చాలా మందికి తెలియని కొన్ని ట్రిక్స్ ఉన్నాయి. వాటిని తెలుసుకుని ఆ తరవాత నడవడం మొదలు పెడితే చాలా తక్కువ సమయంలోనే ఫలితాలు చూడొచ్చు.

గమనిక: ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.

వేగంలో మార్పులు

కొంత మంది వాకింగ్ మొదలు పెట్టారంటే పరిగెత్తినట్టే ఉంటుంది. ఇంకొందరు చాలా తాపీగా పక్క వాళ్లతో మాట్లాడుతూ నడుస్తుంటారు. ఈ రెండూ కరెక్ట్ కాదు. ఒకటే వేగంతో నడవడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. కాసేపు వేగంగా నడిచి, ఆ తరవాత మళ్లీ కాసేపు నెమ్మదిగా నడవాలి. ఇలా స్పీడ్ లో మార్పులు చేసుకుంటూ ఉండాలి. దీన్నే ఇంటర్వెల్ వాకింగ్ అంటారు. ఈ ట్రిక్ ఫాలో అయితే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఒకే వేగంతో నడిచే వాళ్లతో పోల్చి చూస్తే ఇలా ఇంటర్వెల్ వాకింగ్ చేసే వాళ్లకు గుండె జబ్బుల ముప్పు తక్కువగా ఉంటోంది. మూడు నిముషాలు వేగంగా, మరో మూడు నిముషాలు నెమ్మదిగా నడవడం వల్ల బ్లడ్ షుగర్ కంట్రోల్లో ఉంటుంది.

బరువుతో నడవడం

వాకింగ్ చేసేటప్పుడు ఏదైనా బ్యాక్ ప్యాక్ లాంటిది తీసుకుని వెళ్లాలి. ఇలా బ్యాక్ ప్యాక్ వేసుకుని నడవడం వల్ల కండరాల్లో కదలికలు వస్తాయి. ఎక్కువ కేలరీలు కరిగిపోతాయి. అయితే..బరువు ఉండాలి కదా అని మరీ ఎక్కువ వెయిట్ వేసుకుని నడవడం మంచిది కాదు. ముందుగా లైట్ వెయిట్ ని మోస్తూ నడవడం అలవాటు చేసుకోవాలి. మీ బాడీ వెయిట్ లో 5 శాతం మేర బరువుని మోయొచ్చు. అంటే..ఓ వ్యక్తి 80 కిలోల వెయిట్ ఉన్నాడని అనుకుందాం. వాకింగ్ చేసేటప్పుడు ఆ వ్యక్తి 4 కిలోల బరువున్న బ్యాక్ ప్యాక్ తో నడవాలి. అయితే..ఈ వెయిట్ సరైన విధంగా మోయాలి. జెస్చర్ లో తేడా వస్తే ఇబ్బందులు తప్పవు.

మెట్లు ఎక్కడం



వాకింగ్ అంటే చదును నేలపై చేయడమనే అనుకుంటారంతా. కానీ కేవలం అలానే కాదు. మెట్లు ఎక్కడం వల్ల కూడా ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. మెట్లు ఎక్కినప్పుడు కండరాలన్నీ కదులుతాయి. ఇలా చేయడం వల్ల అవి దృఢంగా మారతాయి. పైగా ఇలా మెట్లు ఎక్కినప్పుడు కేలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి. వేగంగా నడవాల్సిన పని లేకుండానే చెమట రూపంలో కొవ్వు కరిగిపోతుంది. ఇలా మెట్లు ఎక్కి దిగడం వల్ల బాడీ బ్యాలెన్స్ కూడా వచ్చేస్తుంది.

మానసిక ఆరోగ్యానికి

వాకింగ్ అంటే కేవలం ఫిజికల్ ఫిట్ నెస్ మాత్రమే కాదు. మానసికంగానూ ఇది ఎంతో మేలు చేస్తుంది. పరిసర ప్రాంతాలను గమనించడం, పూర్తిగా బాడీపైనే ఫోకస్ పెట్టడం లాంటివి చేయడం వల్ల ఎంతో ప్రశాంతత వస్తుంది. దీన్నే మైండ్ ఫుల్ వాకింగ్ అంటారు. ఈ నడకతో ఒత్తిడి చాలా వరకూ తగ్గిపోతుంది. శ్వాసపై ధ్యాస పెట్టడం, చుట్టు పక్కల ఉన్న శబ్దాలను వినడం, వాటిని ఆస్వాదించడం లాంటివి చేయాలి. వాకింగ్ అంటే బద్ధకం ఉన్న వాళ్లు కూడా ఈ మైండ్ ఫుల్ నెస్ ని పెంచుకుంటే నడకను ఎంజాయ్ చేస్తారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

వాకింగ్ చేసేటప్పుడు శరీరానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా మజిల్స్ వదులుగా అయ్యేందుకు వామప్ చేయాలి. కాసేపటి తరవాత నడక మొదలు పెట్టాలి. ఇక వాకింగ్ ముగించే ముందు వేగాన్ని తగ్గించాలి. కాసేపు ఎక్కుడైనా కూర్చోవాలి. స్ట్రెచెస్ లాంటి వ్యాయామాలు చేయాలి. మీకు కంఫర్ట్ గా అనిపించే షూస్ వేసుకోవాలి. వాకింగ్ చేసేటప్పుడు కచ్చితంగా మీ వెంట ఓ వాటర్ బాటిల్ తీసుకెళ్లడం మంచిది. ఎప్పటికప్పుడు నీళ్లు తాగుతూ బాడీని హైడ్రేటెడ్ గా ఉంచాలి. ఒకేసారి బరువు వేసుకుని నడవకుండా క్రమంగా దీన్ని అలవాటు చేసుకోవాలి.